# బొగ్గులు

కట్టెలబట్టి పొగలు కక్కుతుంది. చుట్టూ సెగల వలయాలు. కొంచెం దూరంలో ఉన్న కమ్మల గుడిసెలో మైసయ్య బొగ్గులను ఎట్లా పైసలుగ మార్చేది, ఆలోచిస్తున్నడు.

' ఈలోడ్ మీద వచ్చే లాభంతో దసర, దీపావళి పండుగల రెండు ఖర్చులు ఎల్లాలి. రెండు రోజులైతే బొగ్గుదిగుతది. సత్తిరెడ్డికి చెప్పంపితె లారీ తెచ్చి నింపుకపోతడు. పండుగ బట్టలకోసం ముందుగానె కొంత అడుక్కోవాలి, అనుకుంటున్నపుడే బట్టి కాడికుక్క మొరిగింది. కుక్క ఎవరైనా వస్తేనే మొరుగుతువుంటదని మైసయ్యకు తెలుసు గుడిసె బయటికి వచ్చి

" దండం పంతులు " అని చేతులు జోడించిండు.

దండం అన్నట్టు తలాడించి " ఏం సంగతి గండాన్ని కొని తెచ్చుకున్నవు. పోరంబోకు భూమిలో చెట్లుకొట్టుకోమంటే పట్టా" చెల్కల్ల చెట్లను కొడుతున్నవట " అంటు మోపెడ్‌కు స్టాండు వేస్తు అన్నడు, గ్రామ కార్యదర్శి.

" పంతులు మీరె చూడండి సికంల చెట్లేకొట్టిన " అన్నడు, జోడించిన చేతులను అట్లాగేవుంచి బిక్కు బిక్కుమని చూస్తు.

" చుట్టు పట్టు రైతులు ఎం.ఆర్.ఓకు చెపితేనే నన్ను పంపించిండయ్యా"

" చుట్టు తిరిగి మీరె చూసుకోండి " అంటు చుట్టు వేలితో చూపించిండు.

" మాటలెందుకు కొట్టిన మొదళ్ళు కనిపించవ " ఆరా తీసినట్టు అడిగిండు.

" పంతులు ఎవడుకొట్టినా నామీదికేనా " అన్నడు అమాయకంగా మైసయ్య.

అప్పుడు  ఓ సామెత గుర్తొచ్చిందిగాని అనలేదు. సరిగ్గా అప్పుడే ఓ స్త్రీ కల్లులొట్టి తెచ్చి గుడిసెలో ఉంచి బయటికొచ్చి నిలుచుంది. ఆమె వైపు కన్నార్పకుంట చూస్తూవుండిపోయాడు పంతులు అది గమనించిన మైసయ్య

" పుచ్చుకుంటర దొర " అన్నడు తీయగా.

గ్రామ కార్యదర్శి ఇంకా ఆమెనే చూస్తుఉన్నడు.

' ఎత్తుకుదగ్గ లావు, నుదుట బొట్టు తడిసి ముక్కుమీదికి జారింది. సహజ చిరునవ్వు పెదవులను కదిలిస్తుంది' అనుకొంటు.

" గట్టిదేనా? " అడిగిండు.

" పొంగులు పొంగుతుంటె కనపడతలె చూస్తనే ఉంటిరి " అంది ఆమె విప్పారిన ముఖంతో.

" ఒక్క చెట్టుదే " చేదునాదుంటది. విస్కి కూడ దీనితో సరిరాదు.

" నీవు బట్టిని చూసిరాపో " అంటు గుడిసెలోకి నడిచిండు.
" రొండిన ఉన్న ఆకులను నీళ్ళకుండలో ముంచి తీసి అతని వెనకాల ఆమె. లోపల కునుకు తీస్తున్న కోళ్ళు శబ్దం చేస్తు బయటికొచ్చినయి. వంగి వంచుతుంటె కొంగు జారింది. కల్లులొట్టి కాలి అవుతుంది. ఓ గంట గడిచింది. గుడిసెముందు కుక్కగునుస్తునే వుంది. కొంగు సరిచేసుకొని బయటికొచ్చి నీళ్ళ గోలెందగ్గర ఉన్న నిన్న కాలి చేసిన లొట్టిని అందుకుని నిలుచుంది. అది చూసిన మైసయ్య 'రేపురా' అన్నట్టు సైగ చేసిండు. ఉద్దేరేనా అనుకుంటు నడిచింది వనం వైపు తరువాత బయటికొచ్చిన గ్రామ కార్యదర్శి 'వస్త' లారీనింపినంక వస్త ' అంటు మోపేడ్‌ను స్టార్ట్‌చేసిండు.
మైసయ్య అతనివైపే చూస్తు " థూ దొంగకొడుకు " అంటు తపుక్కున ఉమ్మిండు. అది పేడను దొలుపుకపోతున్న పురుగుమీద పడగానె అది కాసేపు పేడముద్దును వొదిలి పక్కకు జరిగి మళ్ళీ తిరిగొచ్చి నెట్టుకుపోసాగింది.
*
" మైసయ్య సర్పంచ్ రమ్మంటున్నడు " అన్నడు పంచాయితి కారోబార్.
' వీనికి ఎక్కడిది చాలదు అనుకుంటు ' " ఏందట " అడిగిండు మైసయ్య.
" ఏందో నాకెట్ల తెలుస్తది " అన్నడు మైసయ్య చేతిలోని కర్రను గదమకింద ఆనించి నిల్చుంటు.
" అందరు పీకుడుగాళ్లే. ఈబట్టి పెట్టి బతికెకంటె ఊరెళ్ళిపోయి ఇంతకూలి చేసుకున్నది మేలు " అని విసుకుక్కన్నడు. అప్పుడు మైసయ్య ముఖం వికారంగా మారింది.
" అదే బట్టీలు పెడితె లాభాలుండవా పుణ్యానికి వొచ్చిన చెట్లను నర్కి కుప్పచేసి, మన్నుకప్పి మంట అంటిస్తే బొగ్గులాయే అమ్మితే పైసలాయే ఇంకేంది " అన్నడు కారోబార్ నవ్వుతు నాకు అన్నీ తెలుసులే అన్నట్టు చూస్తు.
" చెట్లు పుణ్యానికొస్తే మీ సర్పంచ్ ఎందుకు రమ్మంటడు, వినాయకుడు చెర్ల ఎట్ల పడుతడు. మైసమ్మ ముందు మేకపోతు ఎట్ల తెగుతది. ఇవన్నీ పైసలు ఖర్చు కాకుండానే అయితయా? " తన ఆయాసాన్నంత ఎల్లకక్కిండు మైసయ్య.
" అంతే అంటావా ఇన్నీ జెలగలా నిన్ను పీల్చేది." అనుకోకుండా అన్నడు.
" ఇంక బట్టికాడికి వచ్చిపోయె వాళ్లకు రోజు లొట్లకు లొట్లే కల్లూ " అంటు బయటికొచ్చి పుల్లయ్య తిన్న ఎంగిలినీళ్లు వాకిలి చివరన పారబోస్తు అంది

మైసయ్య భార్య. నీళ్లతో పడ్డ మెతుకులను కోళ్ల గుంపొచ్చి ఏరుక తినాలని చూసి ఒక్క మెతుకు గూడ కనిపించక పోగ అవి తిరిగి వెనక్కు మళ్ళినయి.
" ఎంతో కష్టపడి బట్టికాల్చితే అన్నిపోను ఏమిగులతది. అల్లికల్లి సున్న కుసున్న మందిని బతికిచ్చేది, దీనికంటె కూలి చేసుకోవడమే నయం. నీకు తెలియందేంది లింగన్న ఒకడు గాలి చెడిపోతుందని, ఇంకొకడు చెట్లను నరుకొద్దని - బర్రెలు
గొర్రెలు గూడ మేయని ఈముళ్ళు గుచ్చుకునెనా ఇక ఇంతే సంగతి. ఏలైతే ఏలు, కాలైతే కాలు కట్టింగె. కాల్చితేనే ఇది నాశనమయ్యేది. కాల్చి బొగ్గు చేసి అమ్మితే అన్నిపొంగ ఒకోసారి కూలిగూడ గిట్టదు సుమా " అని తన భాదనంతా కక్కింది మైసయ్య భార్య.
" నీయమ్మ అంతేనా బట్టివిూద బట్టి పెట్టి కట్టలకు కట్టలే సంపాదిస్తుంర్రనుకున్న" అన్నడు కారోబార్ సానుభూతిగా చూస్తు.
" కట్టల కట్టలయితె కట్టుకున్న బట్టలు చెప్పవా? తినెతిండి చెప్పదా? " అని బాధతో అంటు ఇంట్లోకి నడిచింది.
అది వెనుకట అయితె ఎప్పుడో ప్రభుత్వం కట్టించి ఇచ్చిన అర్ర, వరండ వాళ్ళు పక్కజారుడుగ కప్పుకున్న వంటపాక. పిల్లలిద్దరు హాస్టల్లో చదువుతున్నరు.
" ఇంత చేస్తే గొర్రైతోక బతుకేనా? అంటు గదమక్రింది కర్రను చేతిలోకి తీసుకున్నడు లింగం. మైసయ్య దగ్గరికివెళ్ళి ఓ పదిరూపాయల నోటు జేబులో ఉంచుతు " ఇంట్లోలేడనిచెప్పు " అంటు తాను ఇదుపున ఉన్న స్లిప్పర్స్ తొడుక్కుని బట్టివైపు మలుతున్నప్పుడు - " తొడిగేది ఈ స్లిప్పర్స్ తిరిగేది కంపచెట్లల్ల ముండ్లు దిగబడవె " అని అడిగిండు.
" ఎందుకు దిగబడవు. చేసేది ఏముంది. పనిచేస్తేనే కదా పూట కెళ్లేది."
" సరేలే గాని మరి బట్టికాడికి పోయి పిలుచుకురమ్మంటే " అని అడిగిండు.
" రా. ఇంత కల్లు బొట్టన్న తాగొద్దువు " అన్నడు
ఇద్దరు అక్కడి నుండి కదిలింర్రు.
*

బట్టి దగ్గర్కి వెళ్లె సరికి అక్కడ ఓ జీపు ఆగింది. జీపులో యం.ఆర్.ఓ కూర్చోనివున్నడు.
ఆర్.ఐ. ఎదురొచ్చి " సారొచ్చి చాలాసేపైంది " అన్నడు. గాలం చెర్లోకి విసిరి బెండును చూసినట్లుగా చూస్తు.
" అట్టనా " అంటు జీపు దగ్గర్కి వెళ్ళి రెండు చేతులు జోడించి " దండం దొర " అన్నడు మైసయ్య.
యం.ఆర్.ఓ. తలాడించిండు తప్ప మాట్లాడలేదు. ఆర్.ఐ. కల్పించుకుని " బట్టి ఇప్పే వరకొచ్చింది మరి ఇంక కలవలేదేమి సార్ కోప పడుతుండు " అన్నడు.
" కలుస్తా సార్, లోడునింపుకుపోతోడు రాగానే కొంత అడిగి తీసుకొని వచ్చి కలిసి మీకిచ్చేయి మీకిస్తా సార్. తప్పకుండా కలుస్తా. యాడికి పోతసర్ ఇక్కన్నెపడుంటేటోన్ని. బట్టీలు పెట్టి బతికెటోన్ని. మీ మామూలు మీకు ఇచ్చుకొంది నడుస్తదా. ఈ ఒక్క బట్టితోనే పోతదా? అన్నడు జోడించిన చేతులను ఒకదానితో మరొకటి రాస్తు.
" ఆకరికి ఏం చెప్పమంటావ్ " అధికారంగా అడిగిండు.
" వచ్చి కలుస్తానని చెప్పండి " ఏదో మీ దయ అన్నట్టు చూస్తు.
కంప చెట్ల పొదల్లో చీమకోళ్లు అరుస్తూవున్నయి. " మైసయ్యా ఆ కోళ్లు మనయేనా?" అడిగిండు ఆర్.ఐ.
' పద్దాది ' అని లోలోపల అనుకుంటు " మనయే దొర కాని ఇప్పుడు దొరకవు సాయంత్రం చేరినంక పట్టుకోవాలె.
' సరె ' అని యం.ఆర్.ఓ. కు విషయం చెప్పి " సాయంత్రం పంపుదాం సార్ " అన్నడు.
సరె అన్నట్టు తలాడించాడు. జీపు కదిలింది. మైసయ్య అంత వరకు బిగపట్టిన ఊపిరిని ఒక్కసారె వదులుతు బట్టివైపు మళ్ళిండు.

*

హీరోహోండా వచ్చి బట్టికి కొంత దూరంలో ఆగింది. ఆ చప్పుడుకు బట్టి విప్పుతున్న మైసయ్య పని ఆపి లేచి నిలుచోని వచ్చిన వ్యక్తిని గుర్తుపట్టి "

దండందొర " అంటు దగ్గర్కి వెళ్ళి నిలుచుండు.

" ఏమయ్యా బట్టి దొంగతనంగా ఇప్పుతున్నవు " అంటు కనుగుడ్లు పెద్దవి చేస్తు, కీచైన్ వేలుచుట్ట తిప్పుతు అడిగిండు.

" లారీకెత్తెటప్పుడుగా తెలియపరిచేది " అన్నడు మైసయ్యా

" లేదు లైసెన్స్ వెనుక రాసివుంది చూడలేదా "

" నాకు చదువు రాదుగా దొర " అన్నడు అమాయకంగా.

"చదువు రాకుంటె చదివించుకోవాలిరూల్స్ తెలువకుంట బేరం ఎట్లా చేస్తరు "

బట్టివైపు చూస్తు ఒకన్ని రమ్మని సైగ చేసిండు. అతను రాగానే గుడిసెవైపు చూపిండు అతను అటువైపు నడిచిండు. మరొకన్ని పిలిచి " నీవు సైకిల్ మీద ఊళ్ళోకి పోయిరా." అని చెప్పిండు.

" పద బట్టిని చూద్దాం. అంటు బట్టివైపు నడిచిండు. ఆయన వెనకాల మైసయ్య గార్డు బట్టిని పాయతీసి, పాయతీసి చూస్తు కొన్ని కాలిన బొగ్గులను తెచ్చి పక్కకు కుప్పపోసిండు.

చేతులు జోడించి " పేదొన్ని దొర " అంటు ఆయన వెనకాలే నడుస్తువున్నడు. గుడిసె ముందు కోడిని కోసి కాపుతున్నడు. మొదటి కూలి. ఈలోగ రెండవ కూలి విస్కి సీసాతెచ్చి గుడిసెలో పెట్టి బట్టి దగ్గరికొచ్చి నిలుచుండు. అప్పుడే కల్లు కుండలో స్త్రీ గుడిసెవైపు నడుస్తు వుంది. కొంగును నెత్తిమీద కుండకిందచుట్టి పెట్టుకోవడం వల్లా ఎదను కాపలకాస్తున్న పుస్తె తలుక్కున మెరిసింది. గార్డు చూపు అటు మల్లింది. ఆమె గుడిసెలో కల్లుకుండను దించి నెత్తిన చుట్టిపెట్టుకున్న తన కొంగును దులిపి ఎదమీద పరుచుకుని గుడిసెముందు కొచ్చి నిలుచుంది.

" ఓ మైసయ్యా బావ వచ్చిపోతవా " అని పిలిచింది. అది గ్రహించిన మైసయ్యా " రేపు రాపో " అని చెప్పిండు. గార్డు చూపులు అటె ఉన్నదిచూసి మైసయ్యా " కల్లు ఏమన్న " అన్నడు.

" ఆవన్ని నాకు తెలుసుగాని బట్టి ఇప్పటం ఆపండి నేను వెళ్ళి ఆఫీసర్‌ను తీసుకొస్త " అన్నడు.

" అన్నింటికన్నీ వున్నయి ఆఫీసరెందుకు మీరెచూస్తే అయిపోయే. " అన్నడు
" నాకు తెలువదు సార్ రావల్సిందే " అంటు బండిని స్టార్ట్ చేసుకుని బాటపట్టిండు. కొంత దూరంపోయి తిరిగొచ్చి " నేను ఏరిపోసిన బొగ్గులను అట్టెనెపక్కకుంచు ' అని చెప్పి బాటపట్టిండు.

*

రామారావు గారిది చిన్నగూడెమైన ఆయన ఇల్లు చాల విశాలంగా ఉంది. చుట్టు ఉన్న ప్రహరి గోడవెమ్మటి కొబ్బరిచెట్లు. వాటి అవతల పచ్చని పంటపొలాలు. కొబ్బరి చెట్లకింద కూర్చోని రాజకీయాల గూర్చి చర్చించుకుంటు వున్నరు. చుట్టుపట్టునాలుగైదు మండలాల ప్రజల సమస్యలను సరిచూస్తు జనంతో సన్నిహితంగా తిరుగుతువుంటడు రావు అంతేకాదు కాలేజీ చదివె రోజుల్లోను విద్యార్థి నాయకుడుగా వుండేవాడు. ఆ లక్షణాలే ఇంకా కొనసాగుతున్నయి.
సెల్ మోగింది. అందుకుని " హాల్లో " అన్నడు రావు.
" నమస్కారం సార్ నేను సత్తిరెడ్డిని. అదె బొగ్గు బ్రోకర్‌ను సార్ "
" పద్నాలుగోమైలు రాయి దగ్గర మన మైసయ్య బొగ్గుబట్టి పెట్టిండు. లారీ నింపుతుంటే పారేస్టొలొచ్చి ఆపేసింద్రు."
" ఎవరు ఆ మల్లారెడ్డె నా "
" అవును సార్ మల్లారెడ్డి నిన్న వచ్చి కొన్ని బొగ్గులను ఏరి కుప్పపోసి పోయిండట "
" రాంగనే ఓ కోన్ని కోసి, ఓసీసా పెడితేపోయేదిగా "
" పెట్టినా వినలేదట. కంపకట్టెలతో పాటు ఫారెస్ట్ సంబంధించిన సంద్రచెట్లను కొట్టేసింద్రు.ఆఫీసర్‌కు చూపిస్త ఆపైన నీయిష్టం అని ఈ రోజు వాళ్ల ఆఫీసర్‌ను తీసుకొచ్చి లారీనింపనివ్వటం లేదు. మీరు చెప్పాలేసార్ " అవతలి కంఠం.
" ఆ ఆఫీసర్, సుధాకర్‌గారేనా, ఏది ఫోన్‌య్యి"
" సార్ రావుగారు పోన్‌లోవున్నరు. మిమ్ముల మాట్లాడమంటున్నరు " ఆయన అయిష్టంగానే సెల్ అందుకుని "హాల్లోసార్ "
" నమస్కారం సార్, ఏదో పేద దళితుడు కంపకట్టెలు కాల్చుకుని

బతుకుతున్నడు. చూసి చూడనట్టు ఉంటె బాగుంటది "

" కంపకట్టె కాల్చితే ఫరవలేదు ఫారెస్ట్ ప్రొడక్ట్‌ను కాల్చుతున్నడు "

" సార్, మీకు తెలియనిదేముంది.వీరప్పన్ మీసంలో ఓ వెంట్రుకకాదు అతను. వదిలేయండి సార్.

" మావాడు కేసు రాసిపెట్టిండు నేనేమి చేయలేను "

" ఎవరు మల్లారెడ్డి గారా కొంచం మల్లారెడ్డికి ఫోనివ్వండి " సెల్‌ను మల్లారెడ్డికి ఇవ్వగానే

''నమస్కారమండి మల్లారెడ్డి గారు వేము ఈ ఏరియాలో ఉండాలనా,పోవాలనా?"

" అయ్యో అదేంటిసార్ "

" పనికి ఆహారం కల్పిస్తం అంటున్న మన ప్రభుత్వమే కదా ఆహారం కల్పించేమాట అటుంచి నోటి దగ్గరి ఆహారాన్ని పారపోస్తే ఎట్లా కొంచెం ఆలోచించండి" అవతలి కంఠం మాట్లాడడం లేదు.

" వన్యప్రాణులను, పండుకతిన్న వాళ్లనెమనరు, టేకు చెట్లు రూపు మార్చుకొని బంజారహిల్స్‌లో బంగళాలకు కాపలగా ఉన్న చూస్తు ఊర్కుంటరు. పొయిల కట్టెల కొడితే మా కార్యకర్తల మిద కేసులు పెడతరు. చూడు మల్లారెడ్డి ప్రభుత్వం రెడ్లది. మీరు రెడ్డే! బట్టిపెట్టింది ఓ పేద దళితుడు. మీ ఆఫీసర్ యస్‌సినె, ఏదో సెటిల్‌చేసేయండి మధ్యన మమ్ముల ఎందుకు ఇరికిస్తరు. నా కార్యకర్తను నేను కాపాడుకోవాలిగ. పొట్ట బట్టలకోసం చేస్తున్నపనది. మన రాజ్యాంగం ప్రతి పౌరునికి పని చేసుకుని బతికె అవకాశం కల్పించింది. ఏదో చూసి చూడనట్టు పోవాలి. చట్టం పేరుతో ఎవరిపొట్టకొట్టోద్దు ఇక ముందు జాగ్రత్త అని నేను చెపుతాలే " అంటు సెల్ ఆఫ్ చేసిండు.

మల్లారెడ్డి మౌనంలోకి పోయిండు.

సుధాకర్ చూస్తు నిలుచుండు. కాసేపటి తరువాత ఆ ఇద్దర్ని వెంట తీసుకపోయిండు సత్తిరెడ్డి.

' అవును నేను పెద్ద పెద్ద మానులను కొట్టలేదు. పండ్ల చెట్లను పడేయలేదు. ఆ కట్టో ఈ కట్టో కుప్ప పోయకపోతే ఖర్చులన్నీ ఎట్లా ఎల్లుతయి. ' అని

తనలో తానే గులుక్కొంటు గుడిసె వైపు నడిచిండు మైసయ్య.
ఈసారి డబ్బులన్నీ సత్తిరెడ్డి ఖర్చులకిందనే కొసేస్తడని తలంపు రాగానే కళ్లు బైర్లు కుమ్మిగ నీళ్ల కుండ దగ్గర్కి నడిచి ముంతెడు నీళ్ళు తాగి, తలకున్న తుండను తీసుకొని ముఖానికి అద్దుకుంటు కల్లం వైపు నడిచిండు. లారీ నిండుగా కల్లం కాలిగా కనిపించింది. కాలి కల్లంలో తను తన భార్య కాలి కాలని కట్టెల్లా నిలుచున్నరు!

అట్లా కొంతసేపు గడిచింది. గుడిసె వెనుక కోళ్ళను ముంగిస తరిమినట్టుంది. అవి బెదిరి శబ్దం చేస్తున్నయి. మైసయ్య తన భార్యను ఉద్దేశించి " అక్కడ వున్న కొర్లను ఇటివ్వు " అని ఒక్కొక్కటినే అందుకుని, కల్లం ప్రక్కన పేర్చుతువుంటె అది చూసి భార్య ఏదో కాష్టం పేర్చినట్టు పేర్చుతున్నవు ఎందుకు?" అని అడిగింది.
" ఆకరికి అందరికి పేర్చేది ఇదేగా " అన్నడు ఉదాసీనంగా.
" అయితే " అంది విస్తుకుపోయి చూస్తు.
" ఆ కొర్రులను ఇటివ్వు " అంటు కొర్రులకుప్పవైపు చూస్తు చేతులను చాపిండు.
క్షణం ఏమి అర్థం కాక చూసింది భార్య.
" తే, అంది " అన్నడు విసుగ్గా చూస్తు. చేసేది లేక అందియ్య సాగింది.
" ఇది పంతులు గాడు " అంటు కర్రను పేర్చిన వాటిపై వేసిండు.
" ఇది ఆర్.ఐ., ఇది యం.ఆర్.ఓ." అంటు రెండు వేశాడు.
" ఇవి ఫారెస్టోల్లు " అని మరి రెండు వేశాడు.
ఆకరున " ఇది బ్రోకర్ సత్తిరెడ్డి " అని వేశాడు.
" వీళ్ళంతా దొంగనాకొడుకులు. నీవన్నట్టు ఇది కాష్టమే! ఇది వాళ్ళకోసమే పేర్చిన " అంటు వేలితో చూపించాడు. ఆమె మండుతున్న కర్రను అందించింది. అతను దానికి కొరివిపెట్టి మళ్లిచూడకుండా అక్కడి నుండి కదిలిపోతు వుంటే అతని వెనకాల ఆమె వాళ్ళకుక్క!

● అక్టోబర్ 2005.